రూ.5కే అర్జీదారులకు భోజనం

పార్వతీపురం, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు రూ.5కే భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు కలెక్టర్ ప్రభాకరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వచ్చే వారి కోసం ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రతి సోమవారం సుమారు 500 మంది అర్జీదారులు ఈ భోజన సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే గిరిజనులు, వృద్ధులు ఇతరులు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో ఈ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

కోటదుర్గమ్మా.. కరుణించు!

- ఘనంగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు
- నేత్రపర్వం.. నిజరూప దర్శనం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



నిజరూప దర్శనం అనంతరం ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పాలకొండ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉత్కరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 12 రోజుల పాటు తెరచాటున ఉన్న అమ్మవారు సోమవారం నిజరూపంతో భక్తులకు దర్శనమిచ్చింది. ఏడాదికి ఒక్కసారి మాత్రమే ఈ దర్శన భాగ్యం ఉండడంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తెలంగాణ, ఒడిశా నుంచి వేలాది మంది తరలివచ్చారు. ముందుగా కటకం కటుంబ సభ్యులు ఉత్సవాల ముహూర్తపు రాట వేశారు. ఉదయం 8 గంటలకు కలశ స్థాపన చేశారు. ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద శర్మ, ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ దంపతులు పాల్గొని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం 8.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అమ్మవారు నిజరూపంలో దర్శనమిచ్చింది. ఆతర్వాత కోటదుర్గమ్మ బాలా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. మహిళలు సామూహిక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఇదిలా ఉండగా శరన్న వరాత్రి ఉత్సవాల సందర్భంగా దాదాపు 200 మంది పైగా భక్తులు భవానీ దీక్షలు చేపట్టారు. ప్రధాన అర్చకుడు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మాలాధారణ చేశారు. నవగాం గ్రామానికి చెందిన ఎల్.ఉమామహేశ్వరరావు స్వయంగా చిత్రీకరించిన అమ్మవారి పాటను ఎమ్మెల్యే చేతుల మీదుగా విడుదల చేశారు. అమ్మవారిని దర్శించడానికి వచ్చిన భక్తులకు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. అమ్మవారిని శ్రీకాకుళం జిల్లా అడిషనల్ న్యాయాధికారి నాగమణి, మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ ఎమ్మెల్యే వి.కళావతి తదితరులు దర్శించుకున్నారు.



క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

క్యూలైన్లు కిటకిట

ఉదయం ఐదు గంటల నుంచే భక్తులు క్యూ లైన్లలో బారులుదీరారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది శీఘ్ర, వీవీఐపీ, రూ.వంద, రూ.30తో పాటు ఉచిత దర్శనం ఏర్పాటు చేశారు. ఆయా క్యూలైన్లలో భక్తులు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 50 వేల మంది రాగా.. వారికి తాగునీరు, మజ్జిగతో పాటు చిన్నారులకు పాలు అందించారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రాజారావుతో పాటు ఆలయ అధికారులు, సిబ్బందితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, వలంటీర్లు సేవలు అందించారు. డీఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో సుమారు 150 మంది పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

వారపు సంతల్లో వైద్య శిబిరాల పరిశీలన

- సేవలపై సబ్ కలెక్టర్ ఆరా

పాలకొండ/సీతంపేట రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పాలకొండ మండలంలో నవగాం, సీతంపేట వారపు సంతల్లో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాలను సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ పరిశీలించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోగులకు రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించాలని తెలిపారు. మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. సంతల్లో వైద్య శిబిరాలకు రోగులు వచ్చేలా ముందుగా, గ్రామ, మండల స్థాయిలో ప్రజలకు తెలియజేయాలన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

జీఎస్టీ జోష్

- సవరించిన శ్లాబులు అమలులోకి..
- తగ్గిన పలు రకాల వస్తువుల ధరలు
- కొన్నిచోట్ల బోర్డుల ఏర్పాటు
- కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్న ప్రజలు
- కొత్త స్టాక్ రాలేదంటూ కొంతమంది కుంటిసాకులు
- దీనిపై ప్రశ్నిస్తున్న వినియోగదారులు





సాలూరు రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీ శ్లాబులు సోమవారం అమలులోకి వచ్చాయి. దీంతో జిల్లావ్యాప్తంగా 375 రకాల వస్తువుల వస్తువుల ధరలు తగ్గాయి. నిత్యావసర సరుకులు, సిమెంట్, బైక్‌లు, స్పింక్లర్లు తదితర వస్తువులను జీఎస్టీ తగ్గింపు ధరలకు విక్రయించారు. దీంతో ఆయా వస్తువుల కొనుగోలుకు వినియోగదారులు ఆసక్తి చూపారు. అయితే కొన్నిచోట్ల వ్యాపారులు కొత్త స్టాక్ వస్తే ధరలు తగ్గుతాయని చెప్పినా ఫలితం లేకపోయింది. అమలులోకి వచ్చిన తగ్గిన జీఎస్టీ శ్లాబులు పాత స్టాక్‌కు ఎందుకు వర్తించదంటూ ప్రశ్నించారు. మరోవైపు బైక్ షోరూంల్లో ఏ మేరకు ధరలు తగ్గాయనే దానిపై బోర్డులను



(మిగతా 8వ పేజీలో...)



బైక్ షోరూంలో బోర్డు పెట్టిన దృశ్యం

రామతీర్థంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- నేటి నుంచి 9 రోజుల పాటు నిర్వహణ

నెల్లిమర్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలో మంగళవారం నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. వచ్చేనెల 2వ తేదీ విజయదశమి వరకు 9 రోజులపాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహించనున్నారు. మంగళవారం అంకురార్పణతో ప్రారంభమయ్యే ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 29న వేంకటేశ్వరస్వామి వారి కళ్యాణం నిర్వహించడానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల అనంతరం 3న స్వామివారి పుష్పయాగం ఉంటుంది. విజయదశమి రోజున పూర్ణాహుతి, స్వామివారి చక్రస్నానం, జమ్మివేట తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలలో నిర్వహించే విధంగానే రామతీర్థంలో కూడా ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. వేంకటేశ్వరస్వామివారి కల్యాణం కోసం తిరుమల నుంచి పట్టు వస్త్రాలు తీసుకొస్తారు. రామతీర్థంలో బ్రహ్మోత్స వాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు కోరారు.



ఏడాదిలో మూడు పంటలకు ప్రణాళికలు

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు ఏడాదిలో మూడు పంటలు వేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా వాణిజ్య పంటలపై దృష్టిసారించేలా అవగాహన కల్పించాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీకి ఎండార్స్‌మెంట్ చేయాలన్నారు. ఆర్థిక, ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఐవీఆర్ఎస్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. మీడియాలో వచ్చే వార్తలపై జిల్లా అధికారులు స్పందించాలన్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్

రెవెన్యూ సమస్యలపై ప్రతి గ్రామంలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గ్రామస్థాయి అధికారులు గ్రీవెన్స్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా ఫిర్యాదులను పీజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా డ్రైవ్‌ను చేపట్టాలని సూచించారు. రెవెన్యూ కోర్టు ద్వారా నోటీసులు జారీ చేసి పరిష్కార మార్గం చూపాలని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు వ్యయప్రయాసల కోర్చి జిల్లా కేంద్రానికి రాకుండా చూడాలన్నారు.

అంబేడ్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ

నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు అంబేడ్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అక్టోబరు6 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఐబీపీఎస్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ తదితర పోటీ పరీక్షలకు తిరుపతి, విశాఖలో శిక్షణ ఉంటుందని, ఈ కాలంలో అభ్యర్థులకు ఉచిత, వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారని పేర్కొన్నారు. 12న జిల్లా కేంద్రంలో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఈ 99496 86306 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మాతో మాట్లాడితే రూ.10వేల జరిమానంట

- చిల్లంగి నెపంతో వేధిస్తున్నారు
- ప్రాణ భయం ఉంది.. రక్షించండి
- పీజీఆర్ఎస్‌లో వేడుకున్న ఓ కుటుంబం

బెలగాం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ' చిల్లంగి నెపంతో మా కుటుంబాన్ని వేధిస్తున్నారు. ప్రాణ భయం ఉంది. పోలీసులు, అధికారులే మమ్మల్ని రక్షించాలి.' అని సాలూరు మండలం గుర్రపువలస గిరిజన గ్రామానికి చెందిన పాలిక సన్యాసి వేడుకున్నాడు. సోమవారం తన కుటుంబంతో కలిసి కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు వచ్చాడు. కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించాడు. 'మా గ్రామంలో కొంతమంది వ్యక్తులు నా కుటుంబాన్ని బెదిరిస్తున్నారు. చిల్లంగి నెపంతో ఊరి నుంచి బహిష్కరిస్తామంటున్నారు. 'ఎవరైనా మాతో మాట్లాడితే రూ.10 వేలు జరిమానా కట్టాలని, పండుగలకు పిలవొద్దని ఊర్లో వారికి చెబుతున్నారు. జీడి తోటలో పని చేసుకుంటున్న నాపై ఇటీవల కొంతమంది దాడి చేశారు. ఊరి వదిలి వెళ్లకపోతే చంపేస్తామని బెదిరించారు. పాఠశాలలో చదువుతున్న నా కొడుకు పిల్లలను కూడా ఎవరూ కలవద్దని చెబుతున్నారు.' అని వాపోయాడు. దీనిపై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం కోరింది.

సెలవులకు ఇంటికి వచ్చి.. తిరిగిరాని లోకాలకు..

- నీటి గుంటలో స్నానానికి దిగి ఇద్దరు బాలికల మృతి



నీటిగుంట ఇదే..



మౌనిక (ఫైల్)



అంజలి(ఫైల్)

సీతంపేట రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా సెల వుల కావడంతో ఆ బాలికలు ఇళ్లకు వచ్చారు. స్నానానికి నీటి గుంట వద్దకు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండడంతో అందులో మునిగి పోయి మృత్యువాత పడ్డారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ విషాదకర ఘటన సోమవారం సీతంపేట మండలంలోకి చోటుచేసుకుంది. పెద్దగూడ పంచాయతీ పరిధి అచ్చెబ గ్రామానికి చెందిన కొండగొర్రి మౌనిక(12), పాలక రాజీ (అంజలి(11) ముత్యాలు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో 7, 6 తరగతులు చదువుతున్నారు. పాఠశాలకు దసరా సెలవులు ఇవ్వడంతో విద్యార్థి నులు తమ తల్లిదండ్రులతో కలిసి శనివారం స్వగ్రామానికి చేరుకున్నారు. సోమవారం గ్రామంలో తోటి పిల్లలతో వారు సరదాగా గడిపారు. అనంతరం చెల్లెళ్లు శ్రావ్య, నిశితతో కలిసి గ్రామ సమీపంలో ఉన్న నీటి గుంటలో స్నానం చేసేందుకు వెళ్లారు. అయితే అందులో దిగిన మౌనిక, అంజలి ఒక్కసారిగా మునిగిపోయారు. ఇది గమనించిన శ్రావ్య, నిశిత కేకలు వేసుకుంటూ గ్రామంలోకి పరుగులు తీశారు. గ్రామస్థులు, కుటుంబసభ్యులు హుటాహుటిన నీటి గుంట వద్దకు చేరుకుని బాలికల కోసం గాలించారు. అయితే ప్రయోజనం లేకపోయింది. మౌనిక, అంజలి మృతదేహాలను గుర్తించి బయటకు తీశారు. కొండగొర్రి వల్లభరావు, సుశీల దంపతులకు ముగ్గురు సంతానం కాగా వీరిలో మౌనిక రెండో కుమార్తె. పాలక రాజారావు, సుజాత దంపతులకు ముగ్గురు సంతానంలో అంజలి పెద్ద కుమార్తె. తోటి పిల్లలతో ఆడుకుంటూ ఎంతో ఆనందంగా గడిపిన తమ పిల్లలు అకాల మరణం చెందడంతో బాలికల తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఈ ఘటనతో అచ్చెబలో విషాదఛాయలు అలముకున్నాయి. సీతంపేట ఇన్‌చార్జి ఎస్ఐ మస్తాన్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైడిమాంబకు నేడు ఘటాభిషేకం

విజయనగరం రూరల్, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): భక్తుల తలపై ఘటాలు ఎత్తుకుని జై పైడిమాంబ అంటూ నామస్మరణతో విజయనగరం మంగళవారం మార్మోగనుంది. పైడిమాంబకు ప్రీతిపాత్రమైన రోజు కావడంతో ఎక్కువ ప్రాంతాల నుంచి మంగళవారం ముర్రాటలు సమర్పించనున్నారు. అక్టోబరు 6 నుంచి పైడిమాంబ పండుగ నేపథ్యంలో మిగిలిన రెండు మంగళ వారాల్లో భారీగా భక్తులు తరలిరానున్నారు. మంగళవారం సాధారణ రోజుల కంటే అధికంగా మూడు గంటలు ఆలయం తెరిచి వుంచనున్నారు.



కొలువుదీరిన దుర్గమ్మ

● శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణాలు, పల్లెల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకొని.. పూజలు చేశారు.
- ఆంధ్రజ్యోతి బృందం


చీపురుపల్లి: స్వర్ణ కవచ అలంకారంలో కనకమహాలక్ష్మి అమ్మవారు


రాజాం రూరల్: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


జామి: పైడితల్లమ్మ శక్తిపీఠంలో...


సాలూరు రూరల్: కామాక్షి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు


కోటలో దుర్గమ్మకు పూజలు చేస్తున్న రాజ వంశీయులు, కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్

కురుపాం కోటలో...

కురుపాం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కురుపాం కోటలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజవంశీయులు, కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ కుటుంబ సమేతకంగా కోట దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన పురోహితులు కోటలో గల ఆయుధాలను మేళ తాళాలతో పల్లకిపై ఊరేగింపుగా వెళ్లి దుర్గమ్మ గుడిలో అలంకరించారు. పూజల్లో కిషోర్ చంద్రదేవ్ సతీమణి ప్రీతిదేవి, గ్రామపెద్దలు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్‌కుమార్ దేవ్ కోట, రావాడ రోడ్డు కూడలిలోని కోట దుర్గమ్మ ఆలయంలో పూజలు చేశారు.


కొత్తవలస: కొత్తవలస-విజయనగరం రోడ్డులో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద భక్తుల పూజలు


రాజాం: దుర్గాదేవిని కలశాలతో ఊరేగిస్తున్న దృశ్యం


పాలకొండ: కోటదుర్గమ్మ ఆలయంలో పట్టువస్త్రాలతో ఎమ్మెల్యే జయకృష్ణ దంపతులు


వంగర: రుషింగిలో ఊరేగింపుగా..


బొండపల్లి: అంబటివలసలో..


సంతకవిటి: పూజల్లో పాల్గొన్న భక్తులు


ఎస్.కోట: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో రంగుల విద్యుద్దీపాలంకరణ


గుర్ల: గుజ్జంగివలసలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

స్ఫూర్తిప్రదాత.. గురజాడ

మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): 'దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్' అని చాటిచెప్పిన గురజాడ స్ఫూర్తి ఎప్పటికీ సజీవమమేని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో గురజాడ జయంతిని నిర్వహించారు. ముందుగా మహాకవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యానికి ఉన్న శక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మహాకవి గురజాడ అప్పారావు అని తెలిపారు. కన్యాశుల్కం, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ రచనలతో నేటి సమాజ స్థితిగతులను ఆనాడే ప్రజలకు తెలియజేశారని కొనియాడారు. ఆయన రచనలు నిత్య నూతన మన్నారు. ముందు చూపుతో గొప్ప రచనలు చేశారని తెలిపారు. తెలుగు సాహిత్యంలో వాడుక భాష , సమాజ సంస్కరణకు ఎంతో కృషి చేశారన్నారు. నేటి తరం ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం పలువురు చిన్నారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేసీ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో హేమలత, వక్తలు గంట్యాడ గౌరునాయుడు, చింతా అప్పలనాయుడు, స్వామినాయుడు, శివాజీ, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.


గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి

● ఎస్పీ ఏఆర్ దామోదర్


ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఫిర్యాదుదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి... న్యాయం చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి 31 ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించి 8, కుటుంబ కలహాలకు సంబంధించి 4, మోసాలకు పాల్పడినట్టు 5, నగదు వ్యవహారానికి సంబంధించి ఒకటి, ఇతర అంశాలకు సంబంధించి 13 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్టయితే, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు ఏవీ లీలారావు, సుధాకర్, ఎస్ఐ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.


వీఆర్ఎస్ జలాశయం నుంచి విడుదల చేస్తున్న వరదనీరు

సువర్ణముఖికి వరద ఉధృతి

మక్కువ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సంబర గ్రామ సమీపంలోని వెంగళరాయసాగర్ జలాశయంలోకి వరదనీరు వచ్చి చేరుతుండటంతో సువర్ణముఖి నదిలోకి 400 క్యూసెక్కుల నీటిని సోమవారం విడిచిపెట్టారు. వర్షాలు కురుస్తున్నందున వరదనీరు పెద్దఎత్తున జలాశయంలోకి వచ్చి చేరుతుండటంతో సువర్ణముఖి నదిలోకి విడిచిపెడుతున్నాయని ఇరిగే షన్ జేఈ రాజశేఖర్ తెలిపారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. నదీ ప్రవాహం ఎక్కువ కావడంతో డబ్బూరువలస గ్రామానికి నదిలోంచి వెళ్లడానికి వీలు కాకపోవడంతో ప్రజలు స్థానిక చర్చి జంక్షన్ మీదుగా మూడు కిలోమీటర్లు నడిచివెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

అసెంబ్లీలో సమస్యల ప్రస్తావన

శాసనసభ సమావేశాల్లో జిల్లాలోని ఎమ్మెల్యేలు సమస్యలు ప్రస్తావించారు. సోమవారం ఆయా నియోజకవర్గాల పరిధిలోని సమస్యలు వివరించారు. జిల్లాలో సమస్యలు పరిష్కరించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, సంబంధిత మంత్రులను కోరారు.

షెడ్యూల్డ్ జాబితాలో చేర్చేందుకు ప్రతిపాదనలు

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

పార్వతీపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాన్‌షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాల జాబితాలో చేర్చేందుకు అవసరమైన చర్యల్లో భాగంగా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం అసెంబ్లీలో ప్రకటించారు. జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని నాన్‌షెడ్యూల్డ్ గ్రామాలు కూడా షెడ్యూల్డ్ గ్రామాలుగా మారే అవకాశం ఉందన్నారు. రెండు ఐటీడీఏల పరిధిలో నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాలుగా గుర్తించాలని, కొన్ని దశాబ్దాలుగా గిరిజనులు, గిరిజన సంఘాల నేతలు కోరుతున్నారన్నారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారుల నుంచి వెళ్లినా గత ప్రభుత్వాలు ఎటువంటి ప్రకటన చేయలేదన్నారు. ఐటీడీఏల ప్రాంతాల్లోని గ్రామాల్లో 50 శాతం పైబడి గిరిజనులు ఉంటే ఆ గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించే ప్రక్రియపై సంబంధిత ప్రాజెక్టుల అధికారులు, కలెక్టర్ నుంచి నివేదికలు కోరామన్నారు.

అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేయండి

● విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో అంగన్‌వాడీ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అసెంబ్లీలో సోమవారం ప్రస్తావిం చారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయగలిగితే కేంద్రాల నిర్వహణకు ఇబ్బందులు తొలగుతాయన్నారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న విప్ తోయక జగదీశ్వరి

నాలుగులేన్లగా రోడ్డుగా విస్తరించండి

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం-రాయగడ రాష్ట్రీయ రహదారిని నాలుగులేన్లగా విస్తరించాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన కోరారు. సోమవారం నిర్వహించిన అసెంబ్లీ సమావేశంలో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. శ్రీకాకుళం జిల్లా చిలకపాలెం నుంచి పొందూరు, రాజాం, తెర్లాం, బాడంగి, రామభద్రపురం, బొబ్బిలి, పార్వతీపురం మన్యం ప్రాంతం మీదుగా రాయగడ వెళుతున్న సుమారు 130 కిలోమీటర్ల రాష్ట్రీయ రహదారితో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. వాహనాల రద్దీ దృష్ట్యా దీనిని నాలుగులేన్లగా విస్తరించడం చాలా అవసరమన్నారు. అలాగే బొబ్బిలి పట్టణ పరిధిలో మార్కెట్ రోడ్లు వెడల్పు తక్కువగా ఉండడంతో అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని సభలో ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వం పారాది వద్ద వేగావతి నదిపై వంతెన పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. బొబ్బిలి నియోజకవర్గ రోడ్లపై పడుతోందని సభ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ మంత్రిని కోరారు.

చక్కెర పరిశ్రమను తెరిపించండి

● ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం లచ్చయ్యపేటలోని ఎన్‌సీఎస్ చక్కెర పరిశ్రమను తెరిపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బో నెల విజయచంద్ర కోరారు. సో మవారం నిర్వహించిన అసెం బ్లీ సమావేశంలో చెరకు రైతుల సమస్యలను ఆయన ప్రస్తా వించారు. పార్వతీపురం, బొబ్బిలి నియోజకవర్గాల రైతులు చెరకు అధికంగా పండించేవారన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎన్‌సీఎస్ చక్కెర పరిశ్రమ మూతపడిందన్నారు. అందులో పనిచేసిన ఉద్యోగులకు పీఎఫ్, గ్రాడ్యూటీ ఇతర బకాయిలు చెల్లించలేద న్నారు. ఈ పరిశ్రమలో పనిచేసిన పీఎఫ్ హోల్డర్స్, సీనియర్ ఉద్యోగులు ఒక్కొక్కరిగా మృతి చెందుతుండడంతో వారి కు టుంబాలకు బెనిఫిట్స్ అందే అవకాశం లేకుండా పోతోందన్నారు. దీంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు పీఎఫ్, గ్రాడ్యూటీ మంజూరు, ఉద్యోగులను కొనసాగించడానికి సంబంధిత మంత్రి, కార్మిక శాఖాధికారులు వచ్చి పరిశీలించాలని కోరారు.

అర్జీదారులకు సరైన సమాధానం ఇవ్వాలి

● కలెక్టర్ రామసుందర్ రెడ్డి


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులకు సరైన సమాధానం ఇవ్వాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి తెలిపారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి వినతులు చూడాలని చెప్పారు. రీ ఓపెన్ కేసులపైనా పూర్తిగా విచారణ చేపట్టి ముగించాలని తెలిపారు. గడువు లోపలే వినతులకు సమాధానాలు పంపాలని, లేని పక్షంలో సంబంధిత అధికారుల పై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేసీ సేతుమాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, మురళి, ప్రమీల గాంధీ తదితరులు పాల్గొన్నారు. వచ్చిన వినతుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి 106, పంచాయతీరాజ్ కు 15, పింఛన్లు, ఇతర అంశాలపె 28, మున్సిపాలిటీకి 9, విద్యాశాఖకు 2, హౌసింగ్ 2, వైద్య శాఖకు 11, విద్యుత్ శాఖకు సంబంధించి 5 వినతులు ఉన్నాయి.

ప్రజల సంతృప్తి స్థాయి పెరగాలి

ప్రతి సోమవారం వస్తున్న వినతులను పరిష్కరించి... ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా చూడాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మ్యూటేషన్, 1బీ నమోదు, భూముల స్వరూపంపై తహసీల్దారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్యలను క్లిష్టతరం చేయకుండా సులభతరంగా చేసి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. మాజీ సైనికులకు కేటాయించిన భూములపై నిబంధనలు పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ రోజు పీజీఆర్ఎస్‌కు ఎక్కువ శాతం రెవెన్యూకు సంబంధించిన దరఖాస్తులే వచ్చినట్లు కలెక్టరు తెలిపారు. వారానికి కనీసం 2.5 శాతం వృద్ధి సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ కొన్ని పిటిషన్లు 100 రోజులు ఎస్ఎల్ఏకి మించి సమయం ఉన్నప్పటికీ 15-20 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, నోడల్ అధికారి మురళి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో...

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు వినతులు వచ్చాయి. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిషనర్ నల్లనయ్య వినతులు స్వీకరించారు. ఇంజనీరింగు, ప్రణాళికా విభాగాలకు సంబంధించి రెండు వినతులు అందాయి. వీటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత విభాగాధిపతులను కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీప్లానర్ హరిబాబు సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య హక్కులు కల్పించండి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తాము సాగు చేస్తున్న ఇనాం భూములకు సంపూర్ణ భూ యాజమాన్యపు హక్కులు కల్పించాలని చీపురుపల్లి మండలం జి.అగ్రహారం గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద రైతులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. తాము తాతముత్తాలు నుంచి ఆ భూమిని సాగు చేస్తున్నామని తెలిపారు. 375 మంది రైతుల ఈ భూమిపైనే జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరారు.

వేతన బకాయిలు చెల్లించండి

తమకు బకాయి ఉన్న జీతం ఇవ్వాలంటూ గ్రీన్ అంబాసిడర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుడు ప్రమాదవశాత్తూ మరణిస్తే ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలు మంజూరు చేయాలని కోరారు.

పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి

పని గంటల పెంపు యోచనను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయుకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ శాసన సభ 8 గంటలు పనిదినాన్ని 13 గంటలకు పెంచిందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడుకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే కనీస వేతనాలు చట్ట సవరణ చేసి బోర్డు నియమించాలని కోరారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పోలీసు శిక్షణ కేంద్రంలో వసతులు కల్పించండి: ఎస్పీ


శిక్షణ కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

విజయనగరం క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సారిపల్లిలోని పోలీసు శిక్షణ కేంద్రంలో త్వరితగతిన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీసు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. తరగతి గదులు, వంటగది, పరేడ్ గ్రౌండ్, వాటర్ ప్లాంట్, డైనింగు హాల్‌తో పాటు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి త్వరలో 140 మంది కానిస్టేబుళ్లు శిక్షణ నిమిత్తం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ శిక్షణ కూడా త్వరలో ప్రారంభం కానుందన్నారు. శిక్షణ కేంద్రంలో మంచినీటి సమస్య లేకుండా చూడాలని, నగర పాలక సంస్థ అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్పీ వెంట ఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావు, డీఎస్పీ వీరకుమార్, సీఐలు ఏవీ లీలారావు, రామకృష్ణ, లలిత, చంద్ర శేఖర్, ఆర్ఐ గోపాలనాయుడు, ఎస్ఐలు గణేష్, విక్రమ్, రామగణేష్, దేవి, డీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కమిషనర్ పర్యటన

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. పైడిమాంబ, విజయనగరం ఉత్సవాల నేపథ్యంలో నగరంలో వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న సుందరీకరణ పనులను ఆయన పరిశీలించారు. డివైడర్లకు రంగులు అద్దే కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం అన్న క్యాంటీన్‌కు చేరుకుని అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు ముగ్గురు ఎంపిక

లక్కవరపుకోట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): చందులూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్-19 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ఆ పాఠశాల పీడీ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. వీరు 23 నుంచి 25 వరకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన లావణ్య, రుచిత, దేవేంద్రలను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

బోర్లు మంజూరు చేయండి

నెల్లిమర్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జరజాపుపేట హౌసింగ్ బోర్డు కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రెండు బోర్లు మంజూరు చేయాలని సోమవారం ప్రజాఫిర్యాదుల విభాగంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్, వైసీపీ పార్టీ అధికార ప్రతినిధి సముద్రపు రామారావు కౌన్సిల్ సభ్యులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ 17, 18, 19 కౌన్సిలర్ల ప్రతినిధులు మద్దిల వాసు, నల్లి శ్రీను, టి.నారాయణమూర్తి, శివప్రసాద్ పాల్గొన్నారు.

స్థానికంలో సత్తా చాటాలి

రాజాం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను గ్రామాలలో ప్రజలకు వివరించి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్ శర్మ సూచించారు. ఉంగరాడ మెట్టవద్ద ఒక ప్రవేటు కార్యక్రమానికి హాజరైన ఆయనను రాష్ట్ర నీటి పారుదల శాఖ డైరెక్టర్ కోటగిరి నారాయణరావు, రాజాం టౌన్ ప్రెసిడెంట్ జొన్నాడ రంజిత్, జిల్లా కార్యదర్శి గుడివాడ నాగరాజు, జిల్లా మహిళా మోర్చా నాయకురాలు లింగం శారద, చిన్నంనాయుడు, పాలవలస సింహాచలం, నీలయ్య, తదితరులు కలిశారు. జీఎస్టీ సవరణతో రాష్ట్రంలో వేలాది మంది పేదలకు న్యాయం జరుగుతుందని రాజేష్ శర్మ అన్నారు,

స్కౌట్ మాస్టర్‌గా శిక్షణ

వేపాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో నిర్వహించిన భారత్ స్కౌట్స్, గైడ్స్ అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్ శిక్షణ కార్యక్రమంలో సోంపురం ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పి.రమేష్ నాయుడు పాల్గొన్నారు. ఆయనను హెచ్‌ఎం బీవీఏ రాజు అభినందించారు.

ఆర్ఐగా వేణుగోపాలకృష్ణ

భోగాపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): భోగాపురం రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వేణు గోపాలకృష్ణ అదే కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అక్కడి ఆర్ఐగా ఇమ్రాన్ సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. వీరిని తహసీల్దార్ రమణమ్మ, హెచ్‌డీటీ హరి, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, తదితరులు అభినందించారు.

ఇన్‌చార్జి ఆర్ఐగా గిరి

రేగిడి, సెప్టెంబరు 22,(ఆంధ్రజ్యోతి): రేగిడి మండల ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా కోట గిరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ, ఆర్ఐగా అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు.

క్షేత్ర సహాయకులను నియమించండి

భోగాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలిపల్లి గ్రామానికి ఉపాధి హామీ పథకానికి సంబంధించి క్షేత్ర సహాయకులను నియమించాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ కర్రోతు సత్యనారాయణ సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీవో గాయత్రిని కోరారు. గతంలో చేసిన ఎఫ్ఏ అక్రమణలకు పాల్పడ్డారనే ఆరోపణలతో తొలగించారని తెలిపారు. దీంతో సుమారు ఇదు నెలలుగా అక్కడ మేట్ చందక భవాని క్షేత్ర సహాయకుల విధులు నిర్వహిస్తున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కొత్తవారిని నియమించాలని కోరారు. గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన కవులవాడ, లింగాలవలస క్షేత్ర సహాయకులను తొలగించారని...మళ్లీ ఎలా చేర్చుకున్నారని ఏపీవో భాగ్యలక్ష్మిని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే కోండ్రుకు 'పీపుల్‌స్టార్' కృతజ్ఞతలు


మాట్లాడుతున్న ఆర్.నారాయణమూర్తి

రాజాం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీపుల్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి స్వీయ దర్శకత్వంలో రూపొందిన 'యూనివర్సిటీ' చిత్రం స్థానిక సీతారామ థియేటర్‌లో ప్రదర్శితమవుతోంది. సోమవారం మ్యాట్నీ షో మొత్తం టికెట్స్‌ను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుక్‌చేసి... ప్రేక్షలకు ఉచితంగా చూపించారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్యే కోండ్రుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పార్లమెంటరీ బీసీసెల్ అధ్యక్షులు గురవాన నారాయణరావు, ఆగూరు అప్పలనాయుడు, ఎగిరెడ్డి శంకర్, రౌతు వెంకటరమణ, బూరాడ సతీష్, జగన్మోహన్‌రావు, కోటగిరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం ఉత్సవాలలో డ్వాక్రా బజార్


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస్

విజయనగరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాలు, పైడిమాంబ పండుగ సందర్భంగా సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సరస్-2025 పేరిట అఖిల భారత డ్వాక్రా బజారు నిర్వహించనున్నట్టు పీడీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో డీపీఎంఎస్, ఏపీఎంఎస్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జంక్షన్, ట్యాంకు బండ్ రోడ్డులో దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. 250 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 28 నుంచి అక్టోబరు 8 వరకూ మహిళా సంఘాల తయారు చేసే ఉత్పత్తి, అమ్మకాలు, ప్రదర్శన చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ కె.సావిత్రి, ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, అకౌంట్ అధికారి దొర పాల్గొన్నారు.

క్రైం న్యూస్

మద్యం సీసాల స్వాధీనం

గజపతినగరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పురిటిపెంట గ్రామంలోని సంతతోట కాలనీలో ఎక్సైజ్‌శాఖ సీఐ జనార్దనరావు ఆధ్వర్యంలో సోమవారం దాడులు చేసి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కాలనీకి చెందిన బ్రహ్మం బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు చేపడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో మద్యం సీసాలు పట్టుబడినట్లు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ నరేంద్రకుమార్, హెచ్‌సీ బాషా తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం


విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

బొండపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బిల్లలవలస జంక్షన్‌కు సమీపంలో జాతీయ రహదారి 26పై వేగంగా వస్తున్న లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. గజపతినగరం వైపు నుంచి విజయనగరం వెళుతున్న లారీ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టి నిలిచిపోయింది. సమీపంలో వివిధ షాపులు కూడా ఉన్నాయి. లారీ షాపులోకి దూసుకొని వెళితే పలువురు ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఎవరికీ ఏమీ నష్టం కలగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కళింగాంధ్ర చరిత్ర ఎంతో విశిష్టమైనది


కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజాం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రగా పిలవబడే కళింగాంధ్ర చరిత్ర చాలా విశిష్టమైనదని వక్తలు కీర్తించారు. సోమవారం స్థానిక కళాశాలలో కళింగాంధ్ర కవిత సంకలనాన్ని ప్రిన్సిపాల్ చౌదరి రవీంద్ర కుమార్ ఆవిష్కరించారు. కళింగాంధ్రలో గురజాడ, గిడుగు, తాపీ ధర్మారావు, కోడి రామ్మూర్తి వంటి ఘనులు జన్మించారని గుర్తు చేశారు. ఇక్కడి యాస, భాష ప్రత్యేకమైనదని అన్నారు. విద్యార్థులు తమ నేల చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకొని గొప్ప వ్యక్తులుగా మారాలని హితవు పలికారు. పుస్తకాన్ని సిక్కోలు బుక్ ట్రస్ట్ అధ్యక్షుడు దుప్పల రవికుమార్ పరిచయం చేశారు. కళింగాంధ్రకు చెందిన 72 మంది కవులు రచించిన 130 కవితలు ఇందులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, నేతేటి గణేశ్వరరావు, పిల్లా తిరుపతిరావు, తురంగి విశ్వనాథం, అప్పన్న, కుదమ తిరుమలరావు, పెంకి చైతన్యకుమార్, మూడడ్ల శ్రీనివాసరావు, సమతం మహేశ్వరరావు, పడాల కవీశ్వరరావు, పారుపల్లి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రైతుల అభివృద్ధికి సహకరించాలి: నాగార్జున


శ్రీనాథ్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కిమిడి నాగార్జున

విజయనగరం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతుల అభివృద్ధికి సహకరించాలని ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డిని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కిమిడి నాగార్జున కోరారు. సోమవారం అమరావతిలో శ్రీనాథ్‌రెడ్డిని కలిసి జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పంట రుణాల కోసం అదనంగా జిల్లాకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం 5శాతంగా ఉన్న జనరల్ బ్యాంకింగ్ పరిమితికి అదనంగా మరో ఐదు శాతం పెంచాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు ఉపయోగపడే వ్యవసాయ పరికరాలు అందించడానికి సహకరించాలని నాగార్జున కోరారు. రైతుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబాలకు సాయం


బాధితులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వర్లాపల్లి గ్రామంలో ఈ నెల 7న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 5 కుటుంబాలకు చెందిన పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సమక్షంలో శారదా కంపెనీ సోమవారం సాయం అందించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విపత్తుల సమయంలో స్థానిక కంపెనీలు ఉదారంగా వ్యవహరించాలని కోరారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, రగ్గులు, దుప్పట్లు, వంట సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, సర్పంచ్ గోగాడ సత్యం, జి.రామారావు, శారదా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా నగదు అందజేత

తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకొని ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎస్.కోట పట్టణ గౌరీనగర్ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త నాగభూషణం కుటుంబానికి ఎమ్మెల్యే లలితకుమారి సోమవారం తమ నివాసంలో రూ.5 లక్షల ప్రమాద బీమా నగదును అందజేశారు. టీడీపీ కార్యకర్తల కుటుంబానికి పెద్దదిక్కుగా చంద్రన్న ఉండగా ఎవరికీ అన్యాయం జరగదని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేబీఏ రాంప్రసాద్ , జీఎస్ నాయుడు, చంద్రశేఖర్, రామసత్యం, మల్లేశ్వరరావు, రమణాజీ, చెల్లయ్య, కోటి, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'విజేత'కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు


డీఎస్సీ విజేతలను సత్కరిస్తున్న కమిషనర్, సీఐ

రాజాం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజాం విజేత కోచింగ్ సెంటర్ మెగా డీఎస్సీలో మంచి ఫలితాలు సాధించడంతో రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, పట్టణ సీఐ అశోక్‌కుమార్‌లు అన్నారు. సోమవారం విజేత కోచింగ్ సెంటర్‌లో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా విజేత కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న అప్పలరాజు, శ్రీదేవిలను అభినందించారు. ఈ ఏడాది డీఎస్సీలో 200 మంది పిల్లలకు గాను 160 మందికి ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం డీఎస్సీ విజేతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రసాదరావు, వైదుర్గారావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, పక్కి వాసు, కొత్త సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, హరిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఘోషాసుపత్రిలో మొక్కలు నాటిన అధికారులు


మొక్కలు నాటిన అరుణా శుభశ్రీ

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):ఘోషాసుపత్రి ప్రాంగణంలో విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ రవిచంద్ర ఆధ్వర్యంలో మామిడి, పనస, జామ జాతులకు చెందిన సుమారు 60 రకాల హైబ్రిడ్ మొక్కలను గైనకాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ అరుణా శుభశ్రీ సోమవారం సిబ్బందితో కలిసి నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చదనం పెంపు ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు రోగులకు స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. ఆసుపత్రికి వచ్చేవారికి నీడతో పాటు పండ్లను కూడా అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన


రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు

గుర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం గుర్లలో రైతులు గందరగోళం సృష్టించారు. అధికారులు, పోలీసు యంత్రాగం ఉన్నప్పటికీ కనీసం రైతులు పట్టించు కోలేదు. రైతుల కోసం చీటీలు రాసినా కనీసం పట్టించు కోలేదు. తమకు యూరియా వెంటనే ఇవ్వాలని.. లేదంటే రోడ్డుపై వాహనాలను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. వచ్చిన సరుకులను పట్టుకు వెళ్లాలన్న ఆలోచనకంటే ఆందోళన చేయడమే మంచిదని కొంతమంది ఇబ్బందులు పెడుతున్నారని మిగతా రైతులు వాపోయారు. వీటిపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టాలన్నారు.

అధికారుల సమక్షంలో పంపిణీ

బొండపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బొండపల్లిలో సోమవారం రైతుసేవా కేంద్రానికి వచ్చిన 10 టన్నుల యూరియాను రెవెన్యూ, పోలీసులు, వ్యవసాయశాఖ అధికారుల సమక్షంలో రైతులకు పంపిణీ చేశారు. తహసీల్దార్ డోలా రాజేశ్వరరావుతో పాటు ఎస్ఐ యు.మహేష్, గజపతినగరం ఏడీఏ నిర్మలాజ్యోతి, ఏవో పీవీ మల్లికార్జునరావుల ఆధ్వర్యంలో రైతుకు ఒక బస్తా చొప్పున అధికారులు పంపిణీ చేశారు.

జీఎస్టీ సవరణలతో ఉపశమనం



సంతోషం వ్యక్తం చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

శృంగవరపుకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ఉపసంహరించడం ప్రజలకు పెద్ద ఉప శమనమని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ కొనియాడింది. ఎస్‌కోట ఎల్.ఐ.సీ కార్యాలయం వద్ద సోమవారం ఈ శాఖ ఉద్యోగులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. గత ఏడాది ఉత్తరాంధ్రకు చెందిన పార్లమెంటు సభ్యులకు బీమా ప్రీమియంలపై జీఎస్టీను తొలగించాలని విన్నవించామన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న బంగార్రాజు

భోగాపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పోలిపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన దుర్గాదేవి ఉత్సవాల్లో మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు కుటుంబంతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, కర్రోతు రాజు, పైడిరాజు, పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ బిల్లును ఉపసంహరించుకోవాలి



ధర్నా చేస్తున్న కార్మిక సంఘ నాయకులు

రాజాం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, ఉద్యోగులు, శ్రామికులు, మహిళల హక్కుల్ని కాలరాస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక చట్టసవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకుడు రామ్మూర్తి నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడి నాలుగు రోడ్ల జంక్షన్‌లో సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. పని గంటలను పెంచుతూ శాసనసభ ఆమోదించిన తీర్మానం కార్మికులకు ద్రోహం చేయడమేనని ఆరోపించారు. ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ధర్నాలో పలువురు కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

మా భూములు ఇప్పించండి


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న నిర్వాసితులు

ఎస్.కోట రూరల్ సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిందాల్ యాజమాన్యం 18 ఏళ్ల క్రితం తమ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని మోసం చేసిందని, తిరిగి తమ భూములు ఇప్పించాలని కలెక్టర్ రాంసుందర్ రెడ్డిని జిందాల్ నిర్వాసితులు కోరారు. ఈమేరకు పీజీఆర్ఎస్‌లో సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

ఓటరు జాబితాపై సమీక్షించండి

నెల్లిమర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి అధి కారులు 2002 ఓటరు జాబితాపై సమీక్షించి... వారిలో ప్రస్తుతం బతికి ఉన్న వారి పేర్ల జాబితాను తయారు చేయాలని తహసీల్దార్ కె.శ్రీకాంత్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్‌వోలతో సోమవారం జరిగిన సమావేశంలో తహసీల్దార్ ఓటర్ల జాబితాలను బీఎల్‌వోలకు పంపిణీ చేశారు. ఈ నెల 25లోగా జాబితాలను కార్యాలయానికి అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్ జగన్నాథరావు, రీసర్వే డీటీ సత్యనారాయణ, భాస్కరరావు, మహేష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంపై కేసు నమోదు


దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

సంతకవిటి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓం శ్రీ వినాయక ట్రేడర్స్ దుకాణంపై 6ఎ కేసు నమోదు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి సి.బి.యశ్వంత్‌రావు తెలిపారు. ఓం శ్రీ వినాయక ట్రేడర్స్ వారు ఎరువులను ఎమ్ఆర్‌పీ కంటే అధిక ధరలకు అమ్ముతున్నారని కలెక్టర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో తహసీల్దార్ బి.సుదర్శనరావు, ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, వీఆర్ఓ బుచ్చిబాబుల ఆధ్వర్యంలో సోమవారం ఎరువుల దుకాణంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో డీఏపీ, ఎమ్ఓపీ, కాంప్లెక్స్ ఎరువుల్లో 23 బస్తాలు తేడా ఉందని గుర్తించారు. దాని విలువ రూ. 36 వేలు ఉంటుందని తెలిపారు. దీంతో రూ. 13,62,800 విలువ 42.70 మెట్రిక్ టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకున్నట్టు ఏవో యశ్వంత్‌రావు తెలిపారు.

ఎట్టకేలకు సంకిలి వంతెనపై దృష్టి

రేగిడి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాలకొండ- విశాఖ ప్రధాన రహదారిలో ఉమ్మడిజిల్లాలను కలిపే అతి ముఖ్యమైన మార్గమైన సంకిలి నాగావళి నదిపై ఉన్న వంతెన మార్గంపై పాలకొండ ఆర్అండ్‌బీ అధికారులు ఎట్టకేలకు దృష్టి పెట్టారు. ఈ నెల 19న 'ఆంధ్రజ్యోతి'లో 'సంకిలి వంతెనపై జాగ్రత్త సుమీ' అనే శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. దీనిపై పూడికలను తొలగించారు. వంతెనపై పరిశుభ్రత చర్యలు చేపట్టారు.

ముగిసిన విశ్వకర్మ జయంత్యుత్సవాలు

చీపురుపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విశ్వకర్మ జయంత్యుత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా విశ్వకర్మ చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగించారు. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బోనుమద్ది వీరాచారి, మారోజు చక్రధర్, పట్నాన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

దత్తిరాజేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా షికారుగంజి గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 110 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.రఘు, సర్పంచ్ సుంకర వెంకటరావు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డీవీ గిరిబాబు, ఎంపీహెచ్‌వో బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ జోష్

(5వ పేజీ తరువాయి)

పెట్టారు. ధర తగ్గింపు వల్ల బైక్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని, దసరాకు మరింతగా విక్రయాలు పెరిగే అవకాశముందని షోరూం నిర్వాహకులు చెబుతున్నారు. మొత్తంగా జిల్లాలో జీఎస్టీ జోష్ నెలకొంది. పండుగ సీజన్ కావడంతో ప్రజలు కొత్త వాహనాలు, ఇతర వస్తువుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

స్ప్రింక్లర్ ధర తగ్గింది

జీఎస్టీ శ్లాబ్ సవరణతో స్ప్రింక్లర్ ధర తగ్గింది. ఇప్పటి వరకు దాని ధర రూ. 3,500 (అసలు ధర 2870 దానికి 18 శాతం జీఎస్టీ రూ. 630) ఉండేది. ప్రస్తుతం రూ. 3,045 (అసలు ధర రూ. 2870, తగ్గిన జీఎస్టీ 5 శాతం రూ.175)కు కొనుగోలు చేశా.

- వసంతల సింహాచలం, రైతు, గురువునాయుడుపేట

సిమెంట్ బస్తాపై రూ.20 తగ్గింపు

జీఎస్టీ శ్లాబ్ తగ్గింపు వల్ల సిమెంట్ బస్తాకు రూ.20 తగ్గింది. అల్ట్రాటెక్ సిమెంట్ బస్తా రూ. 350 ఉండగా ప్రస్తుతం రూ. 330గా ఉంది. తగ్గిన ధరలతో విక్రయిస్తున్నాం. బిల్లులు సైతం ఇస్తున్నాం. విక్రయాలు ఊపందుకున్నాయి.

- గంటా తాతాజీ, సిమెంట్ వ్యాపారి

ధర తగ్గించి అమ్ముతున్నాం

తలనూనె, షాంపు తదితర కిరణా వస్తువులపై జీఎస్టీ 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గింది. దీంతో వాటి ధరలు తగ్గాయి. పాత స్టాక్‌ను తగ్గిన ధరలకే విక్రయిస్తున్నాం.

- పి.భగవాన్, కిరాణా వ్యాపారి, సాలూరు

బైక్‌కు రూ. 7 వేలు తగ్గింది

జీఎస్టీ 2.0 వల్ల బైక్‌కు రూ.7 వేలు పైబడి తగ్గింది. పొలానికి వెళ్లడానికే బైక్ కొనుగోలు చేశా.

- కె.శ్రీను, కమ్మరివలస, పాచిపెంట మండలం

గుంతల పూడ్చివేత



గుంతలను పూడ్పిస్తున్న జనసేన నాయకులు

పాలకొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరఘట్టం రోడ్డు జంక్షన్‌లో గుంతలను పట్టణ జనసేన నాయకుడు కొండదాడి రాజేశ్ తన సొంత నిధులతో సోమవారం పూడ్పించారు. వాహనదారుల ఇబ్బందులను గుర్తించిన ఆయన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచన మేరకు ఎక్స్‌కవేటర్ సాయంతో గుంతలను పూడ్చివేతకు ఏర్పాట్లు చేశారు. గుంతలను పూడ్చి ట్రాఫిక్ సమస్యలను తీర్చడంలో సహకరించినందుకు డీఎస్పీ రాంబాబు, సీఐ ప్రసాద్, ఎస్ఐ ప్రయోగమూర్తి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బొమ్మాళి సుధ, ఏఎంసీ డైరెక్టర్ డొంక శివప్రసాద్, మిడితాన ప్రసాద్, పొగిరి వెంకటరమణ, పొట్నూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు సోమవారం స్థానిక విద్యుత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల యజమాన్యాలు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయన్నారు. విద్యుత్ బోర్డు విభజనకు ముందు ఉద్యోగ సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందాలకు విరుద్ధంగా సర్వీస్ నిబంధనలను ఏకపక్షంగా మార్పులు చేస్తున్నారన్నారు. 2022 వేతన సవరణపై మునుపెన్నడూ లేని విధంగా ఒక మాజీ ఐఏఎస్ అధికారిని నియమించి పాతపద్ధతికి విరుద్ధంగా ఇంక్రిమెంట్లు, మాస్టర్ స్కేల్స్‌ను రూపొందించడం వల్ల ఉద్యోగులు చాలా నష్టపోయారన్నారు. యాజమాన్యాలతో పలు దఫాలు చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఉద్యమబాట పట్టామన్నారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేఏసీ సభ్యులు కలెక్టర్‌కు వినతపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో 1104 అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వర్లు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు సంతాన నిరోధక వ్యాక్సిన్లు

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం, కురపాం మండలాల్లో వీధి కుక్కలకు సంతాన నిరోధక వ్యాక్సిన్లు వేయడానికి యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పట్నాయక్ సోమవారం పశు సంవర్ధక శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. వీధి కుక్కలకు సంతాన నిరోధక వ్యాక్సిన్లు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో తహసీల్దార్ శేఖరం తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు రేబీస్ వ్యాక్సిన్లు

●కురుపాం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్లు వేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మన్మథరావు అన్నారు. సోమవారం కురుపాం పశువైద్యశాలలో ఆయన ఆధ్వర్యంలో కుక్కలకు వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, ఈవోపీఆర్డీ జి.రమేష్, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

అన్ని వ్యాధులకు పరీక్షలు

సీతానగరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకాన్ని రోగులు వినియోగించుకోవాలని ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. సోమవారం పెదంకలాం పీహెచ్‌సీలో డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటైంది. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ శిబిరంలో ఏర్పాటు చేసిన 14 కౌంటర్ల ద్వారా అన్ని రకాల వ్యాధులకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు అందించేలా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. వైద్యులు డాక్టర్ కౌశిక్, డాక్టర్ నిహారిక, డాక్టర్ స్నిగ్ధ, డాక్టర్ టి.హేమాక్షి, డాక్టర్ పావని సేవలు అందించారన్నారు, ఎంపీహెచ్ఈవో జి.సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన

సీతానగరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి జీవీ రమణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఎం పార్టీ జిల్లా నాయకులు రెడ్డి వేణు, జిల్లా ఐద్వా కార్యదర్శి రామలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎం.సునీత, ఆర్.సింహాచలం, ఎ.లక్ష్మి, జె.గౌరు పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరించండి

● కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి సమస్య పరిష్కారం కావాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత 280 వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం

పార్వతీపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధమని పీహెచ్‌సీల వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ ఎం.వినోద్‌కుమార్, డాక్టర్ పి.ఎల్.రఘు స్పష్టం చేశారు. సోమవారం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, జేసీ యశ్వంత్ కుమార్‌రెడ్డికి వినతి పత్రాలను అందజేశారు. తమ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని డాక్టర్లు కోరారు. అవసరమైతే సమ్మెకు వెళ్తామని నాయకులు స్పష్టం చేశారు.

పీజీఆర్ఎస్‌కు 60 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో

సీతంపేట రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) సమస్యలను పరిష్కరించాలని గిరిజనులు ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌ను కోరారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం పీవో ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్‌కు 60 వినతులు అందాయి. అటవీ భూమికి సర్వే చేసి పట్టా ఇప్పించాలని బొమ్మిక గ్రామానికి చెందిన గణపతి కోరారు. లోకొండ గ్రామంలో పాఠశాల భవనం మంజూరు చేయాలని మోహనరావు, కాంగూడ గ్రామంలో వరద గోడ నిర్మించాలని సవర సరస్వతి విన్నవించారు. సీతంపేట బస్టాండ్ వద్ద సామాజిక మరుగుదొడ్లు నిర్మించాలని శ్రీరాములు కోరారు. మెళియాపుట్టి మండలంలో ఆంపురం నుంచి ఎగువ రింపి వరకు సీసీ రహదారి నిర్మించాలని జమ్మయ్య పీవోకు వినతిపత్రం అందజేశారు. అంత్యోదయ కార్డు ఇప్పించాలని నిమ్మల చిన్నారావు, కుమ్మరిగండిలో అంతర్గత సీసి రహదారి నిర్మించాలని సవర చిరంజీవి వినతులు సమర్పించారు. పీజీఆర్ఎస్‌లో ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నాదొర, టీడబ్ల్యూ ఈఈ రమాదేవి, డిప్యూటీ ఈవో రామ్మోహనరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి, పీహెచ్‌వో ఆర్‌వీ గణేష్, ఏవో వాహిని తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి

సీతంపేట రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గిరిజనుల కోసం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో సోమవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పీవో ప్రారంభించిన అనంతరం పీవో మాట్లాడారు. ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. వైద్యశిబిరంలో 369 మందికి సేవలు అందించినట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. అలాగే ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 36యూనిట్ల రక్తాన్ని సేకరించారు. శిబిరంలో డాక్టర్ శ్రీనివాసరావు, బీజేపి నాయకులు రమణమ్మ, చిరంజీవులు పాల్గొన్నారు.

వైద్యుల డిమాండ్లను పరిష్కరించండి

సీతంపేట రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యాధికారుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని భానుప్రతాప్, చాందిని, సత్యవేణి కోరారు. సోమవారం ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌ను ఐటీడీఏ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధంగా ఉన్నామన్నారు. పీవోను కలిసిన వారిలో వివిధ పీహెచ్‌సీల వైద్యాధికారులు ఉన్నారు.

అష్టాదశ శక్తిపీఠాల ప్రతిష్ఠ



కొలువుదీరిన అమ్మవార్లు

పాలకొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం నక్కలపేట షిర్డీసాయిబాబా సమేత సకల దేవాతాలయంలో సోమవారం అష్టాదశ పీఠాల సహిత లక్ష్మీ, సరస్వతీ సహిత పార్వతీదేవి, బాలాత్రిపురసుందరీదేవి అవతార మూర్తులను ప్రతిష్ఠించారు. ఆలయ ధర్మకర్త కొండబాబు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు రోజూ నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు శరత్ తెలిపారు. ●గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. రావివలసలో దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అర్చకులు తామరాపల్లి నరసింహమూర్తి పూజలు నిర్వహించారు. ●సీతంపేట రూరల్: స్థానిక సంతోషిమాత దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అర్చకుడు వేమకోటి సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలకు పందిరిరాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ●వీరఘట్టం:వీరఘట్టంలోని కోటదుర్గమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజున అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ●భామిని: మండలంలోని బత్తిలి, కొరమలో కోటదుర్గమ్మ ఆలయాల్లో సోమవారం నుంచి శరన్నవరాత్రుల ఉత్సవాలు మొదలయ్యాయి. బత్తిలిలో దుర్గాదేవి విగ్రహానికి పోలీసులు ఆహ్వానించి మండపానికి తరలించారు. వేదపండితుడు రంపా తాతబాబు శర్మ ఆధ్వర్యంలో పలువురు భక్తులు భవానీ మాలలు వేశారు.

● కురుపాం రూరల్: నేరేడువలసలో గిరిజనుల ఆరాధ్య దేవత మాలతమ్మ గుడిలో సోమవారం శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. పురోహితులు చక్రి, భవానీ, రాము అమ్మవారికి పూజాదికాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొత్తకోట రవీంద్రకుమార్ దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

●మక్కువ రూరల్: శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా పోలమాంబ అమ్మవారికి పంచామృతాభిషేకాలతో అభిషేకం చేశారు. రుత్వికుడు విజయనగరానికి చెందిన కె.శ్రీనివాస్‌శర్మచే విశేష హోమాలు నిర్వహిం చారు. ఈవో బి.శ్రీనివాసరావు, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్లు పూడి దాలినాయుడు, గంజి కాశీనాయుడు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి

బెలగాం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం పోలీస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 13 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా ఎస్పీ మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కా రానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ ఆదాం పాల్గొన్నారు.

గిరిజన వారపు సంతల్లో వైద్య శిబిరాలు

పార్వతీపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు వైద్య సదుపాయాలు అందించడానికి వారపు సంతల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి వైద్యాధికారులను ఆదేశించారు. మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని 15 మండలాల్లో 20 ప్రదేశాల్లో సంతలు జరుగుతున్నాయని, ఆయా సంతల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. దాంతో సోమవారం పాలకొండ మండలంలోని నవగాం, కురపాం మండలం నీలకంఠాపురం, సీతంపేటలో వైద్య శిబిరాలు నిర్వహించారు. మంగళవారం సాలూరులోని నేరేళ్లవలస, జీఎల్‌పురంలోని తాడికొండ, కురపాంలోని మొండెంకల్లు ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. బుధవారం పాచిపెంట మండలంలోని నాందేడువలస, సీతంపేటలోని మర్రిపాడు, జీఎల్ పురంలో... గురువారం పార్వతీపురం మార్కెట్‌యార్డు వద్ద, మక్కువ మండ లంలోని దుగ్గేరు, కురపాంలో ప్యాలెస్ రోడ్డు వద్ద శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. శుక్రవారం బలిజిపేటలోని సంతతోట, పాచిపెంట మండలంలో వేటగానివలసలో.. శనివారం మక్కువలోని నంద, జీఎల్‌పురం మండలంలోని గోరాడ, సీతానగరంలోని మార్కెట్ వద్ద, సీతంపేట మండలంలోని కుశిమి, సాలూరులోని తోనాం బస్టాండ్ వద్ద శిబిరాలు నిర్వహించాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు.

కలెక్టరేట్‌లో నిరసనల హోరు



పాఠశాలకు భవనం కావాలని విద్యార్థుల ఆందోళన

బెలగాం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ప్రాంగణం సోమవారం నిరసనలతో హోరెత్తింది. ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్‌కు పలువురు పోటెత్తారు. సమస్యలు పరిష్కరించాలని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అలాగే సమస్యల పరిష్కారం కోరుతూ విద్యుత్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. మక్కువ మండలం మార్కొండపుట్టి గ్రామానికి చెందిన తల్లిదండ్రులు వారి పిల్లలతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల భవనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి



రోడ్డు గుంతను చూపిస్తున్న సాంబమూర్తి

కొమరాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా ఉన్న అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా ఉంది. సుమారు 36 ప్రదేశాల్లో భారీ గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతర్రాష్ట్ర రహదారిపై గుంతలను తక్షణమే పూడ్చాలని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సాలూరులో స్వచ్ఛోత్సవ్

సాలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం స్వచ్ఛోత్సవ్, స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌సీఎం స్కూల్‌లో స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛత ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం స్వచ్ఛత హీ సేవ ఆకృతిలో విద్యార్థులు కూర్చుని ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పర్యావరణ కార్యదర్శులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన ఎస్పీ



గుజరాత్ హైకోర్టు జడ్జితో ఎస్పీ

బెలగాం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గుజరాత్ హైకోర్టు జడ్జి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్‌ని పార్వతీపురంలోని ఆయన స్వగృహంలో ఎస్పీ మాధవరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జడ్జితో ఎస్పీ పలు విషయాలపై మాట్లాడారు.

పెంకిటిల్లులో అగ్ని ప్రమాదం

సీతానగరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డులో గల ఏడిద శ్రీదేవి పెంకిటిల్లులో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. శ్రీదేవి పెంకిటిల్లులో నివాసం ఉంటూనే కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. యథావిధిగా సోమవారం కిరాణా షాపు తెరిచిన కొద్ది సేపటికే విద్యుత్ వైర్లు నుంచి మంటలు వ్యాప్తి చెందడంతో ప్రమాదం సంభవించింది. విషయం తెలుసుకున్న బొబ్బిలి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఆర్ఐ నాగిరెడ్డి శ్రీనివాసరావు, వీఆర్‌వో పైల కుమార్ నాయుడు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమా దంలో ఇంట్లో ఉన్న రెండు వంట గ్యాస్ సిలెండర్లు పేలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం వలన రూ. 2 లక్షలు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

నేడు టీడీపీలోకి ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అధ్యక్షుడు ఉరిటి రామారావుతో పాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు మంగళవారం తాడేపల్లిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరనున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో వారు టీడీపీలో చేరనున్నారు. కొన్ని నెలల కిందట రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్ పార్వతీపురంలో పర్యటించిన నేపథ్యంలో ఎంపీపీ రామారావు మర్యాద పూర్వకంగా ఆయన్ని కలిసిన విషయం తెలిసిందే.

రక్షణ గోడలకు మరమ్మతులు చేపడతాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గరుగుబిల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ఎడమ కాలువపై మైనర్ స్టోన్ ఆర్చర్డ్ బ్రిడ్జి రక్షణ గోడలకు త్వరలో మరమ్మతులు చేయిస్తామని తోటపల్లి రహదారులు భవనాల శాఖ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ వి.రామ్మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న 'ప్రమాదకరంగా కల్వర్టు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. తోటపల్లి నుంచి గుణుపూర్ వెళ్లే రహదారిలో భారీ వాహనాలు ప్రయాణించడం వల్ల తోటపల్లి ఎడమ కాలువ రక్షణ గోడలు విరిగిపోతున్నట్టు గుర్తించామన్నారు. రక్షణ గోడలకు త్వరలో మరమ్మతులు చేపడతామన్నారు.

టార్పాలిన్ల పంపిణీ

పాచిపెంట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బడ్నాయికవలసలో పెద్దగెడ్డ ఎఫ్‌పీవోలకు సోమవారం నాబార్డు, ఆర్ట్స్ సంస్థల ద్వారా తక్కువ ధరకే టార్పాలిన్లను పంపిణీ చేశామని వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. వీటితో పాటు స్ప్రేయర్లు కూడా తక్కువ ధరకు అందిస్తామని ఎఫ్‌పీవో సాలూరు డివిజన్ కోఆర్డినేటర్ ప్రకాశ్ తెలిపారు.

ఓటరు జాబితాల సవరణపై శిక్షణ

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాల సవరణలపై స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఎలక్షన్ డీటీ గౌరీశంకరరావు ఆధ్వర్యంలో 264 మంది బూత్ లెవల్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా 2002 సంవత్సరం నాటి ఓటర్ల జాబితాతో 2025 సంవత్సరం జాబితా సరిపోల్చి అవసరమైన చోట సవరణ చేయాలని సూచించారు.

మహిళల ఆరోగ్యానికి భరోసా



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

గరుగుబిల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఎంతో దోహదపడుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి అన్నారు. సోమవారం ఉల్లిభద్రలో గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుమలప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, పోషకాహార ఆవశ్యకతను వివరించడం, కుటుంబాలను స్వశక్తిగా బలోపేతం చేయడం కోసం తల్లి బిడ్డల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యమన్నారు. మహిళలకు వివిధ రకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జగదీశ్వరి పాల్గొన్నారు.